సాక్షి విశాఖపట్నం

శనివారం । 10 । ఆగస్టు । 2024



'అంబేడ్కర్'పై పచ్చ మూకల ఉన్మాదం 8లో



గంగ పుత్రా.. సరిహద్దు దాటవిక.! 8లో



లంచం అడిగితే ఫోన్ చేయండి 11లో

న్యూస్‌రీల్

హర్ ఘర్ తిరంగా కాన్వాస్ ప్రారంభం



జాతీయ జెండాతో కలెక్టర్ హరేందిర ప్రసాద్

మహారాణిపేట : జిల్లా వ్యాప్తంగా ఈ నెల 13 నుంచి 15వ తేదీ వరకు నిర్వహించనున్న హర్‌ఘర్ తిరంగా విశిష్టతను తెలుపుతూ చేపట్టిన కాన్వాస్ కార్యక్రమాన్ని కలెక్టర్ ఎం.ఎన్.హరేందిర ప్రసాద్ శుక్రవారం ప్రారంభించారు. కలెక్టరేట్ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన హర్ ఘర్ తిరంగా సైన్ బోర్డుపై తొలి సంతకం చేసి అందరిలో స్ఫూర్తి నింపారు. అనంతరం జేసీ కె. మయూర్ అశోక్, డీఆర్వో మోహన్‌కుమార్, టూరిజం రీజినల్ డైరెక్టర్ శ్రీనివాస్ పాణి, జిల్లా టూరిజం అధికారి జ్ఞానవేణి, ఇతర అధికారులు కాన్వాస్ సైన్‌బోర్డ్‌పై సంతకాలు చేశారు.

జీవీఎంసీ ఏడీసీగా రమణమూర్తి బాధ్యతల స్వీకరణ



బాధ్యతలు స్వీకరిస్తున్న డీవీ రమణమూర్తి

డాబాగార్డెన్స్: జీవీఎంసీ అదనపు కమిషనర్‌గా డీవీ రమణమూర్తి శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ముందుగా జీవీఎంసీ కమిషనర్ సంపత్ కుమార్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. స్వచ్ఛ సర్వేక్షణ్ 2024లో విశాఖ ఉత్తమ ర్యాంక్ సాధనకు కృషి చేయాలని కమిషనర్ సూచించారని రమణమూర్తి తెలిపారు. బాధ్యతలు స్వీకరించిన రమణమూర్తికి సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.

ఇన్సూరెన్స్ లేని వాహనాలపై కేసులు

గోపాలపట్నం: ఇన్సూరెన్స్ లేని వాహనాలపై రవాణా శాఖ అధికారులు తనిఖీలు చేపట్టారు. నగరంలో ఆర్‌టీసీ కాంప్లెక్స్, మద్దిలపాలెం, ఆనందపురం ప్రాంతంలో ప్రత్యేక తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో 12 వాహనాలపై కేసులు నమోదు చేసినట్టు మోటారు వాహన తనిఖీ అధికారి బాలాజీరావు తెలిపారు. తనిఖీల్లో ఎంవీఐలు రాజారావు, మాధవి, ఏఎంవీఐ ప్రకాశరావు పాల్గొన్నారు.

వీధి దీపాల నిర్వహణపై కమిషనర్ అసంతృప్తి



వీధి లైట్ల నిర్వహణపై చర్చిస్తున్న జీవీఎంసీ కమిషనర్ సంపత్‌కుమార్

డాబాగార్డెన్స్: వీధి దీపాల నిర్వహణపై జీవీఎంసీ కమిషనర్ సంపత్‌కుమార్ అసంతృప్తి వ్యక్తం చేశారు. జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలోని సిటీ ఆపరేషన్ సెంటర్‌లో ప్రధాన ఇంజనీర్ వినయ్‌కుమార్‌తో కలిసి వీధి దీపాల నిర్వహణపై శుక్రవారం సూక్ష్మ పరిశీలన చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ సీవోసీ స్క్రీన్స్‌పై పలు జంక్షన్లు పరిశీలిస్తూ నగరంలో వీధి దీపాల నిర్వహణ సరిగ్గా లేదని, ప్రజలు చాలా ఇబ్బందులకు గురవుతున్నారంటూ అధికంగా ఫిర్యాదులు వస్తున్నాయన్నారు. వీధిలైట్లు వెలిగేలా చర్యలు చేపట్టాలని బ్రిడ్జ్ అండ్ రూఫ్ కంపెనీ నిర్వాహకులను ఆదేశించారు. వారం రోజుల్లో వీధిలైట్లు సంపూర్ణంగా వెలగాలని లేకపోతే నిర్వాహకులపై చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కార్యక్రమంలో కార్యనిర్వాహక ఇంజినీర్ ఏడుకొండలు, బ్రిడ్జ్ అండ్ రూఫ్ కంపెనీ ప్రతినిధులు పాల్గొన్నారు.

ఇంటింటికీ రేషన్ కొనసాగించాలి



రేషన్ పంపిణీలో ప్రస్తుత విధానాన్నే కొనసాగించాలి. వాహనాలను రద్దు చేస్తే రేషన్ కోసం మళ్లీ దుకాణాల చుట్టూ తిరగాల్సి వస్తుంది. గతంలో రేషన్ డీలర్లు సమయపాలన పాటించేవారు కాదు. తూకాల్లో తేడాలు జరిగేవి. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో వాహనాల ద్వారా సరుకులు పంపిణీ చేస్తున్నప్పటికీ నుంచి మాకు ఎటువంటి ఇబ్బంది లేదు. ఇంటి వద్దనే రేషన్ తీసుకుంటున్నాం.

– అలుగోలు ఆదిలక్ష్మి, చిట్టి వలస

నిర్ణయం మార్చుకోవాలి



జీవీఎంసీ భీమిలి జోన్ ఒకటో వార్డు బంగ్లామెట్టపై ఉంటున్నాం. మా రేషన్ డిపో శ్రీనగర్‌లో ఉంది. అక్కడ నుంచి మెట్టపైకి సరుకులు మోసుకురావడం కష్టంగా ఉంటుంది. రేషన్ వాహనం ద్వారా నేరుగా మెట్టపైకి వచ్చి మా ఇంటి దగ్గర్లోనే అన్ని రకాల సరుకులు ఇస్తున్నారు. వాహనం వచ్చే సమయం కూడా ముందుగా తెలుస్తోంది. మోత బాధ లేదు. పాత విధానంతో మళ్లీ ఇబ్బందులు పడతాం.

– యర్రా ఆదిలక్ష్మి, తగరపువలస

రోడ్డున పడతాం



ఇంటింటికీ రేషన్ కార్యక్రమాన్ని నిలిపివేస్తే తాము రోడ్డునపడతాం. వాహనాల్లో సరుకులు అందించడం ద్వారా ప్రజలకు మేలు జరుగుతోంది. చినగదిలి, పెదగదిలి కొండవాలు ప్రాంతాల్లో సైతం ప్రజలకు ఇంటి వద్దకే వెళ్లి రేషన్ అందించాం. దీనిపైనే ఆధారపడి జీవనం సాగిస్తున్న తమను తొలగిస్తే వేలాది మంది కుటుంబాలు ఇబ్బందులు పడతాయి. ప్రభుత్వం తమ కోసం ఆలోచన చేసి కొనసాగించాలి.

– పాలకుర్తి అయ్యప్ప, ఎండీయూ ఆపరేటర్, పెదగదిలి

మళ్లీ కష్టాలే..



రేషన్ సరుకులు వ్యాన్ల ద్వారా ఇళ్లకే గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అందించింది. వాహనం ఎప్పుడు వస్తుందో కూడా వలంటీర్ ముందుగానే సమాచారమందించేవారు. ఆ సమయానికి వెళ్లి రేషన్ తీసుకునేవాళ్లం. టీడీపీ ప్రభుత్వం మళ్లీ డిపోల ద్వారా రేషన్ పంపిణీకి ఏర్పాట్లు చేస్తుంది. మళ్లీ చాంతాడంత లైన్లు, గంటల కొద్ది వేచి వుండటం షరా మామూలే. రేషన్ డోర్ డెలివరీనే బాగుండేది.

– బూర్లి అరుణ, అల్లిపురం

కాల కూటమితో రేషన్ కష్టాలు



- పండుటాకులకు బాధల పరంపర..
- ఇంటింటి రేషన్‌కు మంగళం
- ఎండీయూ వాహనాలను నిలిపివేయాలని ప్రభుత్వ నిర్ణయం
- రోడ్డున పడనున్న 620 వాహన ఆపరేటర్లు, హెల్పర్ల కుటుంబాలు
- నిరసనలకు సిద్ధమవుతున్న సిబ్బంది
- నిత్యావసరాల కోసం దుకాణాల చుట్టూ తిరగాల్సిందే..

విశాఖ సిటీ : పండుటాకులపై కూటమి ప్రభుత్వం కక్ష కట్టింది. నిత్యావసరాలకు మళ్లీ రేషన్ దుకాణాల చుట్టూ తిప్పాలని నిర్ణయించింది. ఇంటింటికీ రేషన్ అందిస్తూ స్వయం శక్తితో హుందాగా జీవనం సాగిస్తున్న రేషన్ వాహనాల ఆపరేటర్లపై నిర్దాక్షిణ్యంగా వేటు వేసేందుకు సమాయత్తమవుతోంది. ప్రజల మేలు కోసం వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన ఒక్కో సంస్కరణను కాలరాస్తున్న కూటమి ప్రభుత్వం.. తాజాగా ఇంటింటి రేషన్ పంపిణీ కార్యక్రమానికి మంగళం పాడనుంది. సోమవారం అన్ని జిల్లాల కలెక్టర్లతో జరిగిన సమావేశంలో వచ్చే నెల నుంచి మొబైల్ డిస్పెన్సరీ యూనిట్ (ఎండీయూ) వాహనాలను నిలిపివేస్తున్నట్లు ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటించారు. దీంతో ఎండీయూ వాహన ఆపరేటర్లు, హెల్పర్లు జీవనాధారం కోల్పోనున్నారు. మూడేళ్లుగా ఈ వాహనాలపై జీవనం సాగిస్తున్న వారి కుటుంబాలు రోడ్డున పడనున్నాయి. రేషన్ సరుకుల కోసం వృద్ధులు, అనారోగ్యంతో ఉన్న వారు ప్రతి నెలా దుకాణాలకు పరుగులు పెట్టాల్సిన పరిస్థితులు తలెత్తనున్నాయి.

ప్రహసనమే..

రేషన్ దుకాణాల ద్వారా నిత్యావసరాల పంపిణీ ప్రక్రియ మళ్లీ ప్రహసనంగా మారనుంది. ఇంటింటి రేషన్ పంపిణీ ప్రారంభమైన తరువాత రేషన్ డీలర్లు అనేక మంది దుకాణాలను మార్చివేశారు. కొంత మంది అద్దె భారాన్ని తగ్గించుకోడానికి ఇళ్లలోనే షాపులను నిర్వహిస్తున్నారు. ఇప్పుడు ఎండీయూ వాహనాలు నిలిపివేస్తే మళ్లీ డీలర్లు షాపులను అద్దెకు తీసుకోవాల్సి ఉంటుంది. అలాగే కార్డుదారులకు అవి తెలియక కొంత ఇబ్బందులు పడాల్సిన పరిస్థితులు ఎదురవుతాయి. కార్డుదారులకు దూరంగా దుకాణాలు ఉంటే వృద్ధులు, దివ్యాంగులు మరింత కష్టాలు పడాల్సి వస్తుంది. ఇదిలా ఉంటే ఎన్నికలకు ముందు రైస్‌కార్డుదారులకు రేషన్‌లో కొత్త సరుకులు చేరుస్తామని హామీలు గుప్పించారు. అధికారంలోకి వచ్చిన తరువాత ఇచ్చిన హామీలను పక్కనపెడితే కనీసం పంచదార కూడా పంపిణీ చేయడం లేదు. కేవలం బియ్యం మాత్రమే పంపిణీ చేస్తూ చేతులు దులుపుకుంటున్నారు.

రోడ్డున పడనున్న ఆపరేటర్లు, హెల్పర్లు

ప్రతి కార్డుదారుడికీ ఇంటి వద్దనే రేషన్ సరుకులు అందించాలన్న లక్ష్యంగా వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం 2021లో ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ఇంటింటికీ రేషన్ అందించే ప్రక్రియ ద్వారా కార్డుదారులకు శ్రమ తగ్గడమే కాకుండా నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు కలుగుతాయని భావించింది. దీని ప్రకారం మొబైల్ డిస్పెన్సరీ యూనిట్(ఎండీయూ) వాహనాల ద్వారా రేషన్ సరుకుల పంపిణీ కార్యక్రమాన్ని 2021, మార్చి నుంచి ప్రారంభమైంది. జిల్లాలో 310 మంది ఎండీయూ ఆపరేటర్లు, 310 హెల్పర్లను నియమించారు. ఒక్కో వాహనానికి రూ.21 వేలు అందిస్తున్నారు. ఇందులో హెల్పర్‌కు రూ.3 వేలు కలిసి ఇస్తూ వచ్చారు. అప్పటి నుంచి ఈ వాహనాల ద్వారా రెండు, మూడు డిపోల పరిధిలో కార్డుదారులకు ఉదయం 7 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు నిత్యావసరాలను అందిస్తూ వచ్చారు. ఆపరేటర్లు, హెల్పర్లు దీన్నే జీవనాధారంగా చేసుకొని కుటుంబాలను పోషించుకుంటున్నారు. అయితే ప్రభుత్వం ఎండీయూ వాహనాలను నిలిపివేస్తే ఈ 620 మంది ఆపరేటర్లు, హెల్పర్ల కుటుంబాలు రోడ్డు పడే పరిస్థితి ఏర్పడుతుంది. వీరి జీవనాధారం దూరమవుతుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మంచి చేస్తారని భావించి ఓటేసి అధికారం కట్టబెడితే తమ కడుపు కొట్టడం భావ్యం కాదని, రాష్ట్ర ప్రభుత్వం ఈ ఆలోచనను విరమించుకోవాలని కోరుతున్నారు.

కూలి మానుకుని క్యూలో ఉండాల్సిందే..



డిపోల ద్వారా రేషన్ అందజేస్తే మళ్లీ క్యూ లైన్లు తప్పవు. రేషన్ తీసుకోవాలంటే ఆ రోజు కూలి వదులుకోవాల్సిందే. ప్రతి నెల 1 నుంచి 10వ తేదీలోగా రేషన్ బియ్యం వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అందించేది. వలంటీరు మాకు సమాచారం అందించి దగ్గరుండి రేషన్ అందించేవారు. ఇప్పుడు డీలర్లు వారికి నచ్చిన విధంగా నడుచుకుంటారు. మళ్లీ మాకు కష్టాలు ప్రారంభమైనట్టే.

– మునకాల నరసమ్మ, బంగారుమెట్ట

అవస్థలు తప్పవు



రేషన్ దుకాణాలకు వెళ్లి రేషన్ సరుకులు తెచ్చుకోవడం అంటే గగనమే. తెల్లరేషన్ కార్డుదారుడు ఇబ్బందులు పడాల్సి వస్తుంది. ఇంటింటికీ రేషన్ సరుకులు అందించే కార్యక్రమం బాగుంది. నేరుగా మా ఇంటి సమీపంలోనికే వ్యాను వచ్చేంది. వలంటీర్ల ద్వారా సరకులు తీసుకునేవాళ్లం. ఈ పద్ధతికి ముగింపు పలికితే డిపోలకు వెళ్లి రోజంతా లైన్లలో నిల్చొని సరుకులు తెచ్చుకోవడం వ్యయప్రయాసలకు గురికాకతప్పదు. ప్రభుత్వం పునరాలోచించాలి.

– బి.సత్యనారాయణ, నిర్వాసితకాలనీ

మంచి వ్యవస్థను రద్దు చేయడం అన్యాయం



వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రభుత్వం అమలు చేసిన ఇంటివద్దే రేషన్ పథకాన్ని కొనసాగించాలి. ఎండీయూ వాహనాల ద్వారానే రేషన్ సరుకులు ఇంటి వద్దనే అందజేయాలి. దీంతో కూలి పనులు చేసుకునే మాలాంటి వాళ్లందరికి ఇబ్బంది లేకుండా ఉంటుంది.అంతేకాకుండా దివ్యాంగులు, వృద్ధులకు ఎక్కడో ఉన్న రేషన్ షాపునకు వెళ్లి సరుకులు తీసుకోవాలంటే చాలా ఇబ్బంది..గత ప్రభుత్వం హయాంలో ఎండీయూ వ్యవస్థతో ఎంతోమంది నిరుద్యోగులకు ఉపాధి కలిగింది..రేషన్ లబ్ధిదారులకు తూకంలో తేడా లేకుండా ఇంటివద్దకే వచ్చి సరకులు అందిస్తున్నారు. ఇంతటి చక్కటి వ్యవస్థను నిర్వీర్యం చేసే ఆలోచన కూటమి ప్రభుత్వానికి తగదు. డిపోల్లో సరుకులు పంపిణీ చేయడం వల్ల మళ్లీ వ్యయప్రయాసాలు తప్పవు. గంటల తరబడి క్యూలో నిల్చోవాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. ఆసరా లేని వృద్ధులు, దివ్యాంగులు తీవ్ర ఇబ్బందులు పడతారు. ఇంటింటికి రేషన్ అందించాలి. దీనివల్ల వాహన డ్రైవర్లకు ఉపాధి లభిస్తుంది. ఎందరో మలాంటి పేదలకు మేలు జరుగుతుంది.

– షేక్ బాను, ఇస్లాంపేట పెదగంట్యాడ, విశాఖపట్నం

అడవిలో అక్రమ తవ్వకాలు



నరవ ప్రాంతంలో తవ్వకాలు

- నరవ అటవీ ప్రాంతంలో జోరుగా గ్రావెల్ దందా
- కూటమి ప్రభుత్వం వచ్చాక స్థానిక అధికారులను 'మచ్చిక' చేసుకుని రవాణా
- కూటమి నాయకుల కనుసన్నల్లో సాగుతున్న క్వారీ తవ్వకాలు
- రోజుకు కనీసం రూ.2–3 లక్షల వరకు అక్రమ సంపాదన

పెందుర్తి: సాధారణంగా అటవీ ప్రాంతంలో అభివృద్ధి పనులు చేయాలంటే సవాలక్ష ఆంక్షలు ఉంటాయి. కానీ కూటమి ప్రభుత్వంలో అటవీ ప్రాంతానికి దోచుకోవడానికి కేవలం జేసీబీలు, టిప్పర్లు ఉంటే చాలు. అధికారపార్టీ నేత అండ..అధికారుల నిర్లిప్తతతో స్థానిక చోటామోటా నాయకులే రోజుకు రూ.2–3 లక్షలు అక్రమంగా సంపాదిస్తున్నారు. గతంలో నీరు–చెట్టు మాదిరిగా కొండవాలు, అటవీ, ప్రభుత్వ స్థలాలు టీడీపీ సారధ్యంలోని కూటమి నాయకులకు కాసుల వర్షం కురిపిస్తున్నాయి. పెందుర్తి మండల రెవెన్యూ పరిధిలోని జీవీఎంసీ 88వ వార్డు నరవ ప్రాంతంలో నిత్యకృత్యంగా జరుగుతున్న గ్రావెల్ దోపిడీయే దానికి సాక్ష్యం. నరవ సర్వే నంబర్ 29, 27/8ల లోని అటవీ, ప్రభుత్వ స్థలాల్లో అక్రమ గ్రావెల్ తవ్వకాలు జోరుగా సాగుతున్నాయి. స్థానిక రెవెన్యూ, అటవీ శాఖ అధికారులను 'మచ్చిక' చేసుకుని స్థానిక జనసేన, టీడీపీ నాయకులు గ్రావెల్‌ను రాత్రి, పగలు తేడా లేకుండా తవ్వకాలు జరిపి అమ్ముకుంటున్నారు.

లక్షల సంపాదన

నరవ ప్రాంతంలోని సర్వే నంబర్ 29, 27/8 లలో వందలాది ఎకరాల అటవీ భూమి ఉంది. దీంతో పాటు ప్రభుత్వ భూమి కూడా ఉండడంతో ఇక్కడ గ్రావెల్ లభ్యమవుతుంది. దీంతో స్థానిక టీడీపీ–జనసేన నాయకుల పంట పండింది. కూటమి అధికారంలోకి రాగానే స్థానిక నాయకులు చెలరేగిపోతున్నారు. రాత్రి పగలు తేడా లేకుండా జేసీబీల సహాయంతో యథేచ్ఛగా మట్టి తవ్వకాలు జరిపి అమ్మకాలు సాగిస్తున్నారు. వార్డులోని టీడీపీ ముఖ్య ప్రజా ప్రతినిధి, వార్డులోని కీలక జనసేన నాయకులు కుమ్మక్కై ఈ తవ్వకాలు జరిపి అమ్ముకుంటున్నారు. అటవీ, ప్రభుత్వ స్థలాలను 'నీకు ఇంత..నాకు ఇంత' అంటూ వాటాలు వేసుకుని మరీ అక్రమ తవ్వకాలు జరుపుతున్నారు. దీనిపై అటవీ, రెవెన్యూ, మైనింగ్ అధికారులకు సమాచారం ఉన్నా చూసి చూడనట్లు వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. ఇప్పటికైనా స్పందించి ఈ అక్రమ తవ్వకాలను నియంత్రించి ప్రకృతి వనరులను కాపాడాలని స్థానికులు కోరుతున్నారు.



సర్వే నంబర్ 27/8లో మట్టి తవ్వకాలు జరిగిన ప్రాంతం

చర్యలు తీసుకుంటాం

నరవ ప్రాంతంలో మట్టి తవ్వకాలపై దృష్టిసారించాం. ఇప్పటికే ఆ ప్రాంతాన్ని పరిశీలించాం. ఇకపై తవ్వకాలు జరపకుండా క్వారీ ప్రాంతంలో కందకాలు(ట్రించ్)లు ఏర్పాటు చేశాం. అక్కడ తవ్వకాలు జరిపిన ఇల్లపు శ్రీనివాస్‌పై కేసులు నమోదు చేసి గనుల శాఖకు అప్పగించాం. దీనిపై పూర్తిస్థాయి విచారణ చేస్తాం. నిబంధనల ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటాం.

– కె.వేణుగోపాల్, తహసీల్దార్, పెందుర్తి

11 నుంచి 16వ ఫైనాన్స్ కమిషన్ సదస్సు

సాక్షి, విశాఖపట్నం : ఈ నెల 11 నుంచి 13వ తేదీ వరకూ 16వ ఫైనాన్స్ కమిషన్ సదస్సు విశాఖలో జరగనుందని కలెక్టర్ హరేందిర ప్రసాద్ తెలిపారు. ఏయూలోని ఐఐఎం వేదిక ప్రాంగణంలో ఈ సదస్సు జరగనుందని వెల్లడించారు. సదస్సు ఏర్పాట్లు, నిర్వహణ పనులపై జేసీ మయూర్ అశోక్‌తో కలిసి కలెక్టర్ శుక్రవారం సమీక్ష నిర్వహించారు. సమీక్షలో ఐఐఎం డైరెక్టర్ చంద్రశేఖర్, డీసీపీ–1 అజిత, ఆర్డీవో హుస్సేన్‌సాహెబ్, అధికారులు పాల్గొన్నారు.

శ్రావణలక్ష్మీ నమోస్తుతే..



కనకమహాలక్ష్మికి పూజలు చేస్తున్న భక్తులు

డాబాగార్డెన్స్: ఉత్తరాంధ్ర ఇలవేల్పు, విశాఖ వాసుల ఆరాధ్యదైవం కనకమహాలక్ష్మి ఆలయంలో శ్రావణమాసం తొలి శుక్రవారం పురస్కరించుకొని శ్రావణలక్ష్మి ప్రత్యేక పూజలు ఘనంగా నిర్వహించారు. వేదమంత్రాలు, నాదస్వర సుస్వరాల మధ్య ఉదయం 8 గంటలకు పూజలు నిర్వహించారు. రెండు బ్యాచ్‌ల్లో 207 మంది భక్తులు పూజలు చేశారు. అమ్మవారిని పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వహణాధికారి పి.శ్రీనివాసులరెడ్డి, ఆలయ సహాయ కార్యనిర్వహణాధికారులు వెంపలి రాంబాబు, తిరుమలేశ్వరరావు, వేదపండితులు, అర్చకులు ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.



చల్లగా చూడు తల్లీ..

అమ్మవారికి వెండి ప్రతిమలు అందజేత.. : శ్రావణమాసం తొలి శుక్రవారం పూజలో స్వయంగా పాల్గొన్న భక్తుల్లో ఇద్దరికి డ్రా తీసి దేవస్థానం మాజీ చైర్మన్ వంకాయల సన్యాసిరాజు (తాతాజీ) వెండి ప్రతిమలు ఆలయ సహాయ కార్యనిర్వహణాధికారి వెంపలి రాంబాబు చేతుల మీదుగా అందజేశారు.


అమ్మవారికి క్షీరాభిషేకం.. : శ్రావణ శుక్రవారం సందర్భాన్ని పురస్కరించుకొని అమ్మవారి మూలవిరాట్‌కు ఉదయం 7 నుంచి 8 గంటల వరకు క్షీరాభిషేక సేవ నిర్వహించారు. ఈ పూజలో 8 మంది ఉభయ దాతలు పాల్గొన్నారు.

ముత్యాల చీర అలంకరణలో కన్యకాపరమేశ్వరి

పాతనగరం కురుపాం మార్కెట్ సమీపాన వెలసిన కన్యకాపరమేశ్వరి ఆలయంలో శ్రావణమాసం తొలి శుక్రవారం పురస్కరించుకొని అమ్మవారిని ముత్యాల చీరతో అలంకరించారు. ఆలయ మండపంలో 200 మంది మహిళలచే సామూహిక కుంకుమ పూజలు జరిపారు. ఉత్సవ కమిటీ చైర్‌పర్సన్ కొల్లూరు వెంకట సుజాత, కొల్లూరు విశాల, దేవాలయ మహిళా విభాగ అధ్యక్షురాలు బాదం నాగ వెంకట కమల, కట్టమూరి ప్రసన్న తదితరులు పాల్గొన్నారు.



హోమం నిర్వహిస్తున్న వేద పండితులు





ముత్యాల చీరలో కన్యకాపరమేశ్వరి అమ్మవారు, కుంకుమ పూజలు చేస్తున్న మహిళలు

అంబేడ్కర్‌పై పచ్చ మూకల ఉన్మాదం

- ఆగ్రహం వ్యక్తం చేసిన దళిత సంఘాలు
- నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్
- జిల్లా వ్యాప్తంగా నిరసనలు


రెల్లివీధి వద్ద గల అంబేడ్కర్ విగ్రహానికి క్షీరాభిషేకం చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు


అంబేడ్కర్ కూడలిలో నిరసన తెలియజేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు


కళ్లకు నల్ల బాడ్జీలు కట్టుకుని అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన తెలియజేస్తున్న నాయకులు


దాడిని ఖండిస్తున్న అంబేడ్కర్ మెమోరియల్ సొసైటీ ప్రతినిధులు

డాబాగార్డెన్స్: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్రంలో అరాచక పాలన సాగుతోందని 51వ వార్డు కార్పొరేటర్ రెయ్యి వెంకటరమణ ఆరోపించారు. విజయవాడ స్వరాజ్ మైదానంలోని సామాజిక న్యాయ మహాశిల్పంపై అధికారమదంతో పచ్చమూకల చేసిన దాడిని జిల్లా వ్యాప్తంగా దళిత సంఘాలు, పలు పార్టీల నాయకులు ఖండించారు. డాబాగార్డెన్స్‌లోని అంబేడ్కర్ విగ్రహం వద్ద శుక్రవారం జరిగిన నిరసనలో రెయ్యి వెంకటరమణ మాట్లాడారు. రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్ విగ్రహాన్ని లక్ష్యంగా చేసుకుని దాడి చేయడం దారుణమన్నారు. ఈ విషయంలో దళిత బిడ్డగా, హోం శాఖ మంత్రిగా ఎందుకు స్పందించడం లేదని అనితను ప్రశ్నించారు. నిందితులను గుర్తించి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. 37వ వార్డు కార్పొరేటర్ చెన్నా జానకీరామ్ మాట్లాడుతూ రాష్ట్రంలో రాక్షస పాలన నడుస్తోందని ఆరోపించారు. వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు బోని శివరామకృష్ణ మాట్లాడుతూ అంబేడ్కర్ విగ్రహాన్ని తాకితే దళితుల తడాఖా ఏంటో చూపిస్తామని హెచ్చరించారు. అంతకుముందు నాయకులు అంబేడ్కర్ విగ్రహానికి క్షీరాభిషేకం చేసి.. పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఇదేమి రాజ్యం.. ఇదేమి రాజ్యం.. దొంగల రాజ్యమని.. దళితులందరూ ఒక్కటవుదామంటూ నినదించారు. దళిత సంఘాల నాయకులు సొండి సురేష్, కొల్లు భీమారావు, బంగారి సురేష్‌కుమార్, నూకరాజు, భరత్‌వల్లీ, దుర్గాప్రసాద్, ఎర్నిబాబు, వెంకటరమణ, చిన్నారావు, సాధు, శ్యామ్, గణేష్ పాల్గొన్నారు.

దళితుల ఐక్యతను దెబ్బతీసేందుకు కుట్ర

తగరపువలస: ఎస్సీ వర్గీకరణ పేరుతో దళితులను విడదీసినప్పుడు చోద్యం చూసిన టీడీపీ.. పలుమార్లు దళిత సామాజిక వర్గంపై దాడులు చేసిందని జీవీఎంసీ ఒకటో వార్డు వైఎస్సార్ సీపీ నాయకులు ఆరోపించారు. అంబేడ్కర్ సామాజిక న్యాయ మహాశిల్పంపై దాడిని నిరసిస్తూ శుక్రవారం అంబేడ్కర్ కూడలిలో పార్టీ వార్డు అధ్యక్షుడు జగుపల్లి ప్రసాద్ ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. జై భీమ్ నినాదాలతో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. భవిష్యత్‌లో ఇలాంటి దాడులకు పాల్పడకుండా నిందితులపై అట్రాసిటీ కేసులు పెట్టాలని డిమాండ్ చేశారు. పీఏసీఎస్ అధ్యక్షుడు అక్కరమాని రామునాయుడు, మాజీ కౌన్సిలర్ జీవీ రమణ, అక్కరమాని చినబాబు, పందిరి విజయ్, సిమ్మల ప్రసన్న, సోమి అప్పలరాజు, తమ్మిన కూర్మారావు, గిడుతూరి మురళి, విజయసారథి, నీలాపు రామిరెడ్డి పాల్గొన్నారు.

అంబేడ్కర్ విగ్రహంపై దాడి అమానుషం

భీమునిపట్నం: విజయవాడలో అంబేడ్కర్ విగ్రహంపై టీడీపీ మూకలు దాడికి పాల్పడటం దారుణమని వైఎస్సార్ సీపీ వార్డు అధ్యక్షుడు అల్లిపిల్లి నర్సింగరావు, ఎస్సీ సెల్ అధ్యక్షుడు అనపర్తి సూర్యప్రకాశరావు అన్నారు. రెల్లివీధి వద్ద గల అంబేడ్కర్ విగ్రహానికి క్షీరాభిషేకం చేసి.. దాడి ఘటనను ఖండించారు. అంబేడ్కర్ విగ్రహాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. వాసుపల్లి కొండబాబు, పిన్నింటి ఎర్రయ్యరెడ్డి, కోండ్రు రమాసూరప్పుడు, చెల్లూరి గౌరినాయుడు, బోని సంజీవరావు, బోర నాగరాజు, వాడమొదల జగ్గారావు, బర్రి రాజు పాల్గొన్నారు.

అరాచక పాలన సాగుతోంది

కొమ్మాది: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్రం రావణకాష్టంలా మారిందని వైఎస్సార్ సీపీ 4వ వార్డు అధ్యక్షుడు పాల రమణారెడ్డి ఆరోపించారు. కాపులుప్పాడలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద శుక్రవారం వారు కళ్లకు నల్ల బాడ్జీలు కట్టుకుని నిరసన తెలిపారు. నాయకులు వేముల ఈశ్వర్‌రెడ్డి, దుంప సత్యం, గుడ్లకొండ, ఎంరెడ్డి సన్యాసిరావు, కోడిబోయిన వరహాలు తదితరులు పాల్గొన్నారు.

నిందితులను కఠినంగా శిక్షించాలి

సీతంపేట: విజయవాడలోని సామాజిక న్యాయ మహా శిల్పంపై దాడి చేసిన వారిని వెంటనే అరెస్ట్ చేసి కఠినంగా శిక్షించాలని అంబేడ్కర్ మెమోరియల్ సొసైటీ కార్యవర్గం డిమాండ్ చేసింది. విగ్రహం మీద ఉన్న నామ ఫలకం విరగ్గొట్టడాన్ని తీవ్రంగా ఖండించింది. ఈ సందర్భంగా రామాటాకీస్ రోడ్‌లోని అంబేడ్కర్ భవన్‌లో సొసైటీ ప్రతినిధులు నిరసన వ్యక్తం చేశారు. సొసైటీ అధ్యక్షుడు బొడ్డు కల్యాణరావు మాట్లాడుతూ అంబేడ్కర్ విగ్రహంపై దాడి చేయడం దారుణమన్నారు. ప్రధాన కార్యదర్శి జె.వి.ప్రభాకర్ మాట్లాడుతూ నిందితులను అరెస్ట్ చేసి కఠినంగా శిక్షించాలన్నారు. సభ్యులు గౌతంబాబు, బి.రాజు హరి, తాడి కాంతారావు, వివిధ సంఘాల ప్రతినిధులు బోనెల రాజు, గాటాడి జగజ్జీవనరావు, తాడి కాంతారావు పాల్గొన్నారు.


నినాదాలు చేస్తున్న ఏయూ దళిత జేఏసీ ప్రతినిధులు

48 గంటల్లో నిందితులను అరెస్ట్ చేయాలి

- ఏయూ దళిత జేఏసీ డిమాండ్

సాక్షి, విశాఖపట్నం: విజయవాడ స్వరాజ్ మైదానంలోని సామాజిక న్యాయ శిల్పం శిలాఫలకాన్ని ధ్వంసం చేయడంతో పాటు అంబేడ్కర్ పేరులోని 'అం' అనే అక్షరాన్ని తొలగించి అవమానించిన దోషులను గుర్తించి.. శిక్షించాలని ఏయూ దళిత జేఏసీ డిమాండ్ చేసింది. ఈ దాడిని ఖండిస్తూ ఆంధ్రా యూనివర్సిటీలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద జేఏసీ ప్రతినిధులు శుక్రవారం నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఏయూ దళిత జేఏసీ నాయకుడు బోరుగడ్డ మోహన్ బాబు మాట్లాడుతూ భారత రాజ్యాంగ నిర్మాతను అవమానించిన దుండగులను తక్షణమే కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. మహనీయుల విగ్రహాల విషయంలో ప్రభుత్వం తగు భద్రత కల్పించలేకపోవడం దారుణమన్నారు. రాజకీయాల్లోకి అంబేడ్కర్‌ను లాగటం అలవాటుగా మారిందని.. ఇలాంటి చర్యలు మానుకోకపోతే ప్రజా క్షేత్రంలో భంగపాటు తప్పదని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. దాడికి పాల్పడిన దుండగులను 48 గంటల్లో పట్టుకోకపోతే రాష్ట్రవ్యాప్తంగా భారీ ఆందోళనకు పిలుపునిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఏయూ దళిత జేఏసీ నాయకులు డా.రాజకుమార్, డా.స్వరూప్, డా.మండే సురేష్, డా.పొన్నాడ శ్రీనివాస్, డా.వెంకట్, డా.శ్రీనివాసరావు, జాన్సన్ దేవా, బాబ్జి, డా.కల్యాణ్, డా.సుధీర్, డా.చప్పిడి ప్రసాదరావు, డా.అప్పలరాజు పాల్గొన్నారు.

అంబేడ్కర్ విగ్రహంపై దాడి దారుణం

- వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు కోలా గురువులు



కొమ్మాది: విజయవాడలోని సామాజిక న్యాయ మహాశిల్పంపై దాడి చేసిన వారిని వెంటనే అరెస్ట్ చేసి కఠినంగా శిక్షించాలని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు కోలా గురువులు డిమాండ్ చేశారు. భారత రాజ్యాంగ నిర్మాత బి.ఆర్.అంబేడ్కర్ విగ్రహంపై దాడి చేయడం దారుణమని శుక్రవారం విడుదల చేసిన ఓ ప్రకటనలో అన్నారు. పోలీసుల సమక్షంలో ఇలా జరగడం పలు అనుమానాలకు దారితీస్తోందన్నారు. గత ప్రభుత్వ హయాంలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి 125 అడుగుల అంబేడ్కర్ కాంస్య విగ్రహం ఏర్పాటు చేశారని గుర్తు చేశారు. విజయవాడ నగరం నడిబొడ్డున అంబేడ్కర్ విగ్రహం ఉండటం.. ముఖ్యమంత్రి చంద్రబాబు జీర్ణించుకోలేకపోతున్నారని ఆరోపించారు.

విశాఖ-బెంగళూరు స్పెషల్ పునరుద్ధరణ

తాటిచెట్లపాలెం: విశాఖపట్నం-బెంగళూరు మధ్య గతంలో నడిచిన స్పెషల్ ఎక్స్‌ప్రెస్‌ను పునరుద్ధరిస్తున్నట్లు వాల్తేర్ డివిజన్ అధికారులు తెలిపారు. ప్రతీ ఆదివారం విశాఖపట్నంలో బయలుదేరే విశాఖపట్నం-బెంగళూరు(08543) స్పెషల్ ఈ నెల 18 నుంచి, ప్రతీ సోమవారం బెంగళూరులో బయలుదేరే బెంగళూరు-విశాఖపట్నం(08544) స్పెషల్ ఈ నెల 19 నుంచి మళ్లీ పట్టాలెక్కనుంది.

కోరమండల్ ఎక్స్‌ప్రెస్ ఆలస్యం

తాటిచెట్లపాలెం: ఎంజీఆర్ చెన్నై సెంట్రల్-షాలిమర్ (12842) కోరమండల్ ఎక్స్‌ప్రెస్ సుమారు 15.30 గంటలు ఆలస్యంగా శుక్రవారం రాత్రి 10.30 గంటలకు చెన్నై సెంట్రల్‌లో బయలుదేరింది. పెయిరింగ్ రైలు ఆలస్యం కారణంగా ఎంజీఆర్ చెన్నై సెంట్రల్‌లో ఈ రైలును రీ షెడ్యూల్ చేశారు. అంతే ఆలస్యంగా ఈ రైలు ఆయా స్టేషన్లకు చేరుకుంటుంది. ఈ రైలు శుక్రవారం రాత్రి 7.50 గంటలకు విశాఖపట్నం చేరుకోవాల్సి ఉండగా.. శనివారం ఉదయం 10.30 గంటలకు చేరుకోవచ్చని రైల్వే అధికారులు తెలిపారు.

గంగ పుత్రా.. సరిహద్దు దాటవిక!

పూట గడిపేందుకు వేటకు వెళ్లి.. రోజుల తరబడి సముద్రంలోనే జీవనం సాగించే మత్స్యకారులు.. చిన్నపాటి తప్పిదంతో సరిహద్దులు దాటి ప్రాణాల మీదకు తెచ్చుకుంటున్నారు. సరిహద్దు దేశాల రక్షణ దళాలకు చిక్కుకుని.. బయటకు వచ్చేందుకు ఏళ్ల తరబడి శిక్షలు అనుభవిస్తున్నారు. ఈ గడ్డుకాలానికి మత్స్యశాఖ స్వస్తి చెబుతోంది. ఫిషరీస్ సర్వే ఆఫ్ ఇండియా సహకారంతో ప్రతి అంశంపైనా హెచ్చరికలు జారీ చేసే ట్రాన్స్‌పాండర్లను జిల్లా వ్యాప్తంగా 1,110 బోట్లకు అమర్చనుంది. జాతీయ అంతరిక్ష దినోత్సవం సందర్భంగా ఈ నెల 23న ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టనుంది. ఈ మేరకు అత్యాధునిక స్పేస్ టెక్నాలజీపై ఆ శాఖ అధికారులు మత్స్యకారులకు అవగాహన కల్పించారు. – మహారాణిపేట

- మత్స్యకార బోట్లకు ట్రాన్స్‌పాండర్ల అమరిక
- సమగ్ర సమాచారం అందించేలా ఏర్పాట్లు
- జిల్లాలో 1,110 బోట్లకు అమర్చేందుకు ప్రణాళికలు
- ఈ నెల 23న ఈ కార్యక్రమానికి శ్రీకారం

సముద్రంలో ప్రతికూల, ఆపద సమయాల్లో మత్స్యకారులకు ప్రాణరక్షణ కల్పించేలా ముందస్తు హెచ్చరికలు జారీ చేస్తూ.. వారు సురక్షిత ప్రాంతాలకు వెళ్లేందుకు సహకరించే వ్యవస్థ అందుబాటులోకి వచ్చింది. భారత అంతరిక్ష పరిశోధన సంస్థ(ఇస్రో) రూపొందించిన ట్రాన్స్‌పాండర్లు జిల్లాలోని బోట్లకు అమర్చనున్నారు. భారత మత్స్య పరిశోధన సంస్థ కార్యాలయంలో ఫిషరీస్ సర్వే ఆఫ్ ఇండియా, ఏపీ మత్స్యశాఖ సంయుక్త ఆధ్వర్యంలో 'మత్స్యరంగంలో స్పేస్ టెక్నాలజీ వినియోగం' పై శుక్రవారం అవగాహన సదస్సు జరిగింది. కలెక్టర్ హరేంధిర ప్రసాద్ ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ నెల 23న జరగనున్న జాతీయ అంతరిక్ష దినోత్సవంలో భాగంగా ఈ పరికరాలను మత్స్యకారులకు అందించనున్నట్లు ప్రకటించారు. ఇస్రో రూపొందించిన ఈ ట్రాన్స్‌పాండర్లను మోటరైజ్డ్, మెకనైజ్డ్ బోటు యజమానులందరూ వినియోగించాలని కలెక్టర్ సూచించారు. వీటిని కేంద్ర ప్రభుత్వం అందరికీ ఉచితంగా అందిస్తోందని వెల్లడించారు.


ఎఫ్ఎస్ఐ మ్యూజియం వివరాలను కలెక్టర్‌కు వివరిస్తున్న సంస్థ ముఖ్య అధికారి బామిరెడ్డి, మత్స్యశాఖ జేడీ విజయ

ట్రాన్స్‌పాండర్ ఎందుకు?



సముద్రంలో వాతావరణం ఎలా ఉంది.? తుపాను హెచ్చరికలు ఏమైనా ఉన్నాయా.? అనే సమాచారం అందించేలా ట్రాన్స్‌పాండర్‌ను రూపొందించారు. వేటకు వెళ్లే మత్స్యకారులు కొన్ని సందర్భాల్లో ఫోన్ సిగ్నల్స్‌ను కోల్పోతారు. అటువంటప్పుడు.. వారికి తుపాను సమాచారం, ఇతర ప్రమాదాల సమాచారం చేర్చాలంటే అత్యంత కష్టం. కానీ ఈ ట్రాన్స్‌పాండర్ల ద్వారా సులువుగా మత్స్యకారులకు ఇటువంటి సమాచారం అందించవచ్చు. అంతేకాదు చేపల పెంపకానికి సంబంధించిన సమాచారాన్ని ఇది అందిస్తుంది. పడవ లోపల అమర్చిన బజర్ నొక్కడం ద్వారా ఏదైనా ప్రమాదంలో చిక్కుకున్నా.. అత్యవసర పరిస్థితులు అవసరమైనా.. మత్స్యశాఖ అధికారులను అప్రమత్తం చేయవచ్చు. ఎస్ఎంఎస్ సంకేతాలతో పాటు దేశాల సరిహద్దుల సమాచారం దీని ద్వారా పొందవచ్చు.


అవగాహన సదస్సుకు హాజరైన మత్స్యకారులు, బోటు యజమానులు

అవగాహన కల్పిస్తున్నాం

సదస్సులో భాగంగా ఫిషరీస్ సర్వే ఆఫ్ ఇండియా ముఖ్య అధికారి డి.బామిరెడ్డి, మత్స్యశాఖ జాయింట్ డైరెక్టర్ విజయ మాట్లాడుతూ ఈ నెల 23న జాతీయ అంతరిక్ష దినోత్సవం ఘనంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆ రోజు జిల్లాలోని మత్స్యకారులకు ట్రాన్స్‌పాండర్లను అందజేస్తామని వెల్లడించారు. వీటి ద్వారా వేట సమయంలో ఎలాంటి ఇబ్బందులు కలిగినా సహాయ సహకారాలు పొందవచ్చని సూచించారు. జిల్లాలో మొత్తం 350 మోటరైజ్డ్, 760 మెకనైజ్డ్ బోట్లకు వీటిని ఉచితంగా అందజేస్తామని వివరించారు. ట్రాన్స్‌పాండర్లను ఎలా వినియోగించాలనే అంశంపై ప్రతి మత్స్యకారుడికీ అవగాహన కల్పిస్తున్నామని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో జూనియర్ ఫిషరీస్ శాస్త్రవేత్త జీవీఏ ప్రసాద్, అవెంటల్ సీనియర్ ఇంజినీర్ గజానం ప్రసాద్ యాదవ్, డిసాక్ అహ్మదాబాద్ శాస్త్రవేత్త జి.సాయి రామకృష్ణ, బోట్ ఓనర్స్ అసోసియేషన్ అధ్యక్షులు, మత్స్యకారులు, సాగర మిత్రలు పాల్గొన్నారు.

ఎఫ్ఐడీఐసీ ఒప్పందాలపై వర్క్‌షాపు


మాట్లాడుతున్న వైస్ అడ్మిరల్ శ్రీనివాసన్ గోపీనాథన్

తగరపువలస: ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ విశాఖపట్నం(ఐఐఎంవీ), డైరెక్టరేట్ ఆఫ్ నేవల్ ప్రాజెక్ట్స్ విశాఖ సంయుక్తంగా ఎఫ్ఐడీఐసీ ఒప్పందాలపై మూడు రోజుల వర్క్‌షాప్‌ను శుక్రవారం ప్రారంభించాయి. గంభీరంలోని ఐఐఎంవీలో జరిగిన వర్క్‌షాప్‌లో నేవీ అధికారులు పాల్గొని.. రక్షణ రంగంలో ఒప్పందాల నిర్వహణకు సంబంధించిన వివిధ అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా డైరెక్టర్ జనరల్ ఆఫ్ నేవీ ప్రాజెక్ట్స్, వైస్ అడ్మిరల్ శ్రీనివాసన్ గోపీనాథన్ రక్షణ రంగంలో కీలకమైన కాంట్రాక్ట్ నిర్వహణ గురించి వివరించారు. ఈ ఏడాది నావికాదళానికి అత్యధిక మూలధన బడ్జెట్‌ను కేటాయించినట్లు చెప్పారు. డెడికేటెడ్ ఫ్రైట్ కారిడార్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్ జనరల్ మేనేజర్ అజిత్ కుమార్ మిశ్రా ఎఫ్ఐడీఐసీ కాంట్రాక్ట్ ఫారాలు, కాంట్రాక్టర్ క్లైంలు, ఎంప్లాయీస్ క్లైంలు, ఆలస్యం క్లైంలు, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ప్రాజెక్టుల్లో పొడిగింపులు, నిపుణుల పాత్ర-ప్రాముఖ్యం, కమర్షియల్ ఆర్బిట్రేషన్ గురించి వివరించారు. ప్రోగ్రాం డైరెక్టర్‌గా ఎస్.చటర్జీ వ్యవహరించగా.. ఐఐఎంవీ డైరెక్టర్ ఎం.చంద్రశేఖర్, 31 మంది నేవల్ అధికారులు పాల్గొన్నారు.

గంజాయి కేసులో ఐదేళ్ల తర్వాత చిక్కిన నిందితులు

సీతమ్మధార : గంజాయి కేసులో ఐదేళ్లుగా పోలీసుల కళ్లుకప్పి తప్పించుకు తిరుగుతున్న ముగ్గురు నిందితులను ద్వారకా పోలీసులు శుక్రవారం అరెస్ట్ చేశారు. అల్లూరి సీతారామరాజు జిల్లాకు చెందిన చిలుకూరి సాయి నిఖిల్, అనకాపల్లి జిల్లా నక్కపల్లికి చెందిన వంగలపూడి వెంకట సాయి, సిమ్మిగూడకు చెందిన గొల్లోరి సాయి 2019లో గంజాయి అక్రమ రవాణా చేసినట్లు ద్వారకా స్టేషన్‌లో కేసు నమోదైంది. అప్పటి నుంచి వారు పోలీసులను తప్పించుకుని తిరుగుతున్నారు. ఈ నేపథ్యంలో పోలీసులు వారిని శుక్రవారం అరెస్ట్ చేశారు. కోర్టులో హాజరు పరచగా.. రిమాండ్ విధించారని సీఐ రమేష్ తెలిపారు.

భెల్‌ను సందర్శించిన డైరెక్టర్ బనివర్మ


బనివర్మను సన్మానిస్తున్న గుర్తింపు యూనియన్ ప్రతినిధులు

అక్కిరెడ్డిపాలెం: భెల్ కార్పొరేట్ డైరెక్టర్(ఐఎస్ అండ్ పీ) బనివర్మ.. శుక్రవారం భెల్(హెచ్‌పీవీపీ) విశాఖపట్నం యూనిట్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా ఆమెను సంస్థ పరిపాలన భవనంలోని బోర్డు హాలులో గుర్తింపు యూనియన్ ప్రతినిధులు కలిసి శాలువా కప్పి పుష్పగుచ్ఛాలు అందజేశారు. పలు కార్మిక సమస్యలను ఆమె దృష్టికి తీసుకెళ్లి, వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో హెచ్‌పీవీపీ ఈడీ ఎస్.జితేందర్ రెడ్డి, ఏజీఎం(హెచ్‌ఆర్) ఎస్.లీల, సీనియర్ మేనేజర్(హెచ్‌ఆర్) జి.చంద్రశేఖర్, సంస్థ ఎస్సీ, ఎంప్లాయీస్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి కొల్లి దేముడు, గుర్తింపు యూనియన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బొండ బాబూరావు, సుభాకర్ సాహు, పి.వి.ఎస్.రాజు, జి.కిరణ్, బి.రవీంద్రబాబు, కంచిపాటి ప్రకాష్ పాల్గొన్నారు. అలాగే భెల్ కార్పొరేట్ డైరెక్టర్ బనివర్మను సంస్థ ఇంటక్, సీఐటీయూ నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కార్మిక సమస్యలపై వినతిపత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో ఇంటక్, సీఐటీయూ నాయకులు సీతం నాయుడు, కె.విజయ్‌కుమార్, వి.ఆనందరావు, జి.చిన్నబాబు, పి.ఆనంద్‌కుమార్, ఆర్.జనార్దనరావు, మురళీశ్వరరావు, చిట్టిబాబు తదితరులు పాల్గొన్నారు.

వివాహ వేడుకలో ఘర్షణ.. యువకుడికి గాయాలు


గొడవలో గాయపడిన కార్తీక్

సీతమ్మధార : ఓ వివాహ ఊరేగింపు వేడుకలో జరిగిన గొడవలో ఓ యువకుడు గాయపడ్డాడు. ద్వారకా పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. సీతంపేటలోని యాదవ ఫంక్షన్ హాలులో శుక్రవారం వివాహ వేడుక నిమిత్తం ఊరేగింపు నిర్వహించారు. వధువుది దొండపర్తి కాగా, వరుడిది సీతంపేట. శుక్రవారం రాత్రి ఊరేగింపు సందర్భంగా ఇరు కుటుంబీకులు, స్నేహితులు డ్యాన్స్ చేశారు. మార్గం మధ్యలో కొందరు యువకుల మధ్య ఘర్షణ జరిగింది. దీంతో యువకులు పరస్పరం దాడులు చేసుకున్నారు. వారిలో దొండపర్తికి చెందిన కార్తీక్(22) తలకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికుల సమాచారంతో ద్వారకా సీఐ రమేష్ సిబ్బందితో హుటాహుటిన సంఘటన స్థలానికి చేరుకుని గాయపడిన యువకుడిని 108 అంబులెన్స్‌లో కేజీహెచ్‌కు తరలించారు. ఈ ఘర్షణకు కారణమైన దొండపర్తికి చెందిన శ్రీనివాస్ అలియాస్ ఇత్తిడి చెంబును అదుపులోకి తీసుకున్నారు. బాధితుడి ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ధరేంద్ర తెలిపారు.